## అరుణ్‌జ్యోతి కాలనీలో కార్పొరేటర్ పర్యటన



కార్పొరేటర్ హేమలతను సన్మానించిన కాలనీవాసులు

బన్సీలాల్‌పేట్, అక్టోబర్ 5 : బస్తీబాట కార్యక్రమంలో భాగంగా గురువారం డివిజన్‌లోని అరుణ్‌జ్యోతి కాలనీలో కార్పొరేటర్ హేమలత పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికుల కోరిక మేరకు ఖాళీ స్థలంలో ప్రజల అవసరార్థం నూతన కమ్యూనిటీ హాలును నిర్మిస్తామని, కొత్తగా సీసీ రోడ్లు కూడా ఏర్పాటు చేస్తామని స్థానికులకు తెలిపారు. అనంతరం హనుమాన్ దేవాలయంలో కార్పొరేటర్‌ను శాలువాతో సన్మానించారు. కాలనీవాసులు సంధ్య, లలిత, నీరజలు పాల్గొన్నారు.

## కానిస్టేబుల్‌కు పదోన్నతి

ఎర్రగడ్డ, అక్టోబర్ 5: బోరబండ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న రంజిత్‌కుమార్‌కు హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి లభించింది. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని వివిధ పీఎస్‌లలో పని చేసిన రంజిత్‌కుమార్ జూన్‌లో కొత్తగా ఏర్పడ్డ బోరబండ ఠాణాకు బదిలీ అయ్యారు. పదోన్నతి పొందిన ఆయనను ఇన్‌స్పెక్టర్ కామల్ల రవికుమార్, ఎస్సైలు, సిబ్బంది అభినందించారు.

## పార్క్ సుందరీకరణ పనుల పరిశీలన



పార్క్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ హేమలత, పవన్‌కుమార్ గౌడ్

బన్సీలాల్‌పేట్, అక్టోబర్ 5 : పద్మారావునగర్ పార్క్‌లో అభివృద్ధి సుందరీకరణ పనులను పూర్తి చేసి ఈ నెల 11న ప్రారంభించనున్నామని బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి పవన్‌కుమార్ గౌడ్ అన్నారు. బన్సీలాల్‌పేట్ కార్పొరేటర్ హేమలత, జీహెచ్‌ఎంసీ ఉద్యానవన శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజ్‌కుమార్‌లతో కలసి ఆయన పార్కును సందర్శించారు. ప్రతిరోజు పార్కుకు వచ్చే వాకర్లు, సాధారణ ప్రజల కోరిక మేరకు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ రూ.26 లక్షలను కేటాయించారని తెలిపారు. పార్కులో పచ్చదనం పెంచడం, పూలమొక్కల వనం, కూర్చునేందుకు కొత్త బెంచీలు ఏర్పాటు, యోగా కేంద్రం లాంటివి ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. పార్కు లోపల ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను బయటకు తరలిస్తామన్నారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రణధీర్, జర్నలిస్ట్ చంద్రశేఖర్, కాలనీ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వెంకటేశన్ రాజు, వెంకటరమణ, జగ్గయ్య, దుర్గ, అంబిక, హరిచారి, కుశాల్, సురేశ్, శ్రీనివాస్, మల్లేశ్, వినోద్, రజనీశ్ పాల్గొన్నారు.

## వ్యక్తి అదృశ్యం



సయ్యద్‌అక్రమ్

ఎర్రగడ్డ, అక్టోబర్ 5: పని మీద బయటకు వెళ్లిన వ్యక్తి వారం రోజులైనా తిరిగి ఇంటికి చేరుకోలేదు. బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఈ సంఘటన వివరాలు.. ఇన్‌స్పెక్టర్ కామల్ల రవికుమార్ తెలిపిన ప్రకారం.. బోరబండ ఎస్సార్టీ నగర్‌లో సయ్యద్‌అక్రమ్ కుటుంబం నివాసం ఉంటున్నది. అక్రమ్ వారం రోజుల క్రితం ఏదో పని మీద బయటకు వెళ్లాడు. ఆయన భార్య పలుమార్లు ఫోన్ చేయటంతో పాటు బంధువులు, తెలిసిన వాళ్ల దగ్గర ఆరా తీసినప్పటికీ అక్రమ్ ఆచూకీ లభించలేదు. దీంతో అక్రమ్ భార్య ఫైజా బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని ఎస్సై సర్దార్ జమాల్ దర్యాప్తు చేస్తున్నారని సీఐ పేర్కొన్నారు.

## జూబ్లీహిల్స్‌లో 3,75,430 మంది ఓటర్లు

జూబ్లీహిల్స్, అక్టోబర్5: తాజా ఓటరు జాబితాలో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 18,435 మంది ఓటర్లు పెరిగారు. తుది ఓటరు జాబితా ప్రకారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 3,75,430 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 1,98,204 మంది పురుషులు, 1,77,207 మంది మహిళలు, 19 మంది థర్డ్ జెండర్ ఓటర్లున్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఫైనల్ పబ్లికేషన్‌ను గురువారం ఎలక్టోరల్ ఆఫీసర్, డిప్యూటీ కమిషనర్ చంద్రశేఖర్ తుది ఓటరు జాబితాను విడుదల చేశారు. ఇటీవల విడుదల చేసిన డ్రాఫ్ట్ పబ్లికేషన్ ఓటరు జాబితా ప్రకారం జూబ్లీహిల్స్‌లో 3,56,995 మంది మంది ఓటర్లుండగా జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో గత రెండు నెలలుగా చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌ల ఫలితంగా ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరిగింది.

# సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం

- మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్
- కల్యాణలక్ష్మి చెక్కులు అందజేత



లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

బేగంపేట్ అక్టోబర్ 5: సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు.గురువారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద సనత్‌నగర్ నియోజకవర్గానికి చెందిన 72 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం కింద మంజూరైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక కార్యక్రమాలు దేశంలోని అనేక రాష్ట్రాల్లో అమలవుతున్నాయని



పాల్గొన్న లబ్ధిదారులు

తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని తెలిపారు. పేదింటి ఆడపచుల పెండ్లికి లక్ష 116 రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని వివరించారు. వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఆసరా పింఛన్ కింద ప్రతి నెల ఆర్థిక సహాయాన్ని నేరుగా బ్యాంక్ ఖాతాలో జమచేస్తున్నట్టు తెలిపారు. అదే విధంగా సొంత ఇల్లు లేని పేద మధ్య తరగతి కుటుంబాలకు అన్ని సౌకర్యాలతో కూడిన డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మించి ఉచితంగా ఇస్తూ సొంతింటి కలను నెరవేరుస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్‌లు కొలన్ లక్ష్మి, మహేశ్వరి, హేమలత, మాజీ కార్పొరేటర్‌లు అరుణగౌడ్, ఆకుల రూప,శేషుకుమారి తదితరులు పాల్గొన్నారు.

# ఆడబిడ్డలకు బతుకమ్మ చీరలు పంపిణీ



యూసుఫ్‌గూడలో బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

జూబ్లీహిల్స్,అక్టోబర్5: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న బతుకమ్మ కానుకలను అర్హులందరికీ అందిస్తామని ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. యూ సుఫ్‌గూడ సర్కిల్‌లో 59,872 మంది మహిళలకు బతుకమ్మ కానుకలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. గురువారం యూసుఫ్‌గూడలో కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్‌తో కలిసి బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. యూసీడీ ప్రాజెక్ట్ ఆఫీసర్ హిమబిందు పాల్గొన్నారు.

**అర్హులందరికీ చీరలు..**


యూసుఫ్‌గూడ సర్కిల్‌లో అర్హులందరికీ బతుకమ్మ చీరలు అందిస్తామని డిప్యూటీ కమిషనర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. జీహెచ్‌ఎంసీ 19 సర్కిల్ పరిధిలో 38 కేంద్రాల్లో బతుకమ్మ చీరల పంపిణీ చేపడుతున్నామన్నారు. యూసుఫ్‌గూడ, రహ్మత్‌నగర్, వెంగళరావునగర్, బోరబండ, ఎర్రగడ్డ డివిజన్‌లలో ఫుడ్ సెక్యూరిటీ కార్డు కలిగిన మహిళలకు బతుకమ్మ చీరలు అందజేస్తామని తెలిపారు. ప్రతి ఇంట్లో 18 ఏండ్లు నిండిన మహిళలకు కానుకలు పంపిణీ చేస్తున్నామన్నారు.

**కేసీఆర్ హ్యాట్రిక్ విజయం ఖాయం**

బంజారాహిల్స్: పేదలకు అండగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ సాధించడం ఖాయమని ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బీసీబంధు రెండో విడుతలో భాగంగా 125 చెక్కులను గురువారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మాట్లాడుతూ.. తొలివిడుత బీసీ బంధులో భాగంగా 300మందికి రూ.1లక్ష చొప్పున సాయం అందించామని, రెండోవిడుతలో 125మందికి చెక్కులు అందిస్తున్నామన్నారు. ఒకవైపు దళితబంధు, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పంపిణీ, మైనార్టీలకు రూ.1లక్ష సాయంతో పాటు బీసీ బంధు పథకాలను అమలు చేస్తున్న సీఎం కేసీఆర్‌కు పేదలంతా అండగా నిలువాలని కోరారు. గృహలక్ష్మి పథకం కింద ఇండ్ల నిర్మాణం కోసం రూ. 3లక్షల సాయం అందించనున్నామని, తొలివిడుతలో భాగంగా శుక్రవారం నియోజకవర్గంలో సుమారు 1500మందికి తొలివిడుతలో గృహలక్ష్మి ప్రొసీడింగ్స్ అందిస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ ఆశన్న, సహకారశాఖ రిజిస్ట్రార్ రమాదేవి, కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్‌తో పాటు బీఆర్‌ఎస్ నాయకులు ప్రదీప్‌కుమార్, కృష్ణమోహన్, విజయ్‌కుమార్, నజీర్, రామకృష్ణ, అఫ్తాబ్, సర్దార్ పాల్గొన్నారు.

**అభివృద్ధి పనులకు శంకుస్థాపన..**

జూబ్లీహిల్స్: సీఎం కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ ప్రభుత్వం రాజకీయాలకతీతంగా అభివృద్ధిని చేసిందని ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ తెలిపారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ ఇబ్బందులు లేకుండా చూడటమే ధ్యేయంగా పనిచేసిందన్నారు. గురువారం డివిజన్‌లోని యూసుఫ్‌గూడ బస్తీలో రూ.20 లక్షలతో చేపట్టనున్న రోడ్డు విస్తరణ పనులకు.. జయప్రకాశ్‌నగర్ ఇంజినీర్స్ కాలనీలో రూ.15 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులు, కాలనీ వాసులు, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



బీసీబంధు చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

## జ్యోతిరాజాకు 'ఏపీజే అబ్దుల్ కలామ్' అవార్డు

బన్సీలాల్‌పేట్, అక్టోబర్ 5 : ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ జ్యోతిరాజా 'ఏపీజే అబ్దుల్ కలామ్ ఎక్సలెన్స్ అవార్డు–2023'కి ఎంపికయ్యారని సృజనా ఆర్ట్స్ క్రియేషన్ సాంస్కృతిక సంస్థ వ్యవస్థాక కార్యదర్శి రాజేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. న్యూబోయిగూడలో డాక్టర్ జ్యోతి రాజా శ్రీదీప్తి కౌన్సెలింగ్ సెంటర్ ఏర్పాటు చేసి వందలాది మంది యువతకు, విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస శిక్షణ అందజేశారన్నారు.